కుల, మత, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టేలా

# వైసిపి నేతల కుట్రలు

- జువ్వలదిన్నె ప్రాజెక్టుపై వైసిపి నీచ రాజకీయానికి పాల్పడుతోంది

: మంత్రులు కొల్లు రవీంద్ర, జనార్ధన్‌రెడ్డి



మీడియా సమావేశంలో మంత్రులు కొల్లు రవీంద్ర, బిసి జనార్దన్

**విజయవాడ,ఏప్రిల్ 16, ప్రభాతవార్తప్రతినిధి:** పెట్టుబడులు తీసుకొచ్చి.. పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తుంటే.. కడుపు మంటతో ఓర్వలేక మాజీ సీఎం పెద్దలు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని.. రాష్ట్ర ఎక్సైజ్, గనులు, భూగర్భవనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో తీర ప్రాంతం, మత్స్యకారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రులు స్పష్టం చేశారు.. ఆంధ్రప్రదేశ్ లో నేడు పెట్టుబడుల అనుకూల వాతావరణం ఉండటం, భారీగా పెట్టుబడులు రాష్ట్రానికి తరలి రావడాన్ని జీర్ణించుకోలేక, ప్రతిపక్షం దుష్ప్రచారం చేస్తోందని మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ను ప్రవేట్ పరం చేస్తున్నామంటూ ప్రతిపక్షం చేస్తున్న విమర్శలు పూర్తిగా వాస్తవ విరుద్ధమని కొట్టిపారేశారు.. మీడియా సమావేశంలో మంత్రులు కొల్లు రవీంద్ర, బీసీ జనార్ధన్ రెడ్డి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ ఎం. టీ కృష్ణబాబు సంయుక్తంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. నేడు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చే పెట్టుబడిదారులను భయభ్రాంతులకు గురిచేయడం ఒక కార్యక్రమంగా పెట్టుకుని మాజీ సీఎం పనిచేస్తున్నారని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ధ్వజమెత్తారు...నిన్న జువ్వెలదిన్నె ఫిషింగ్ హార్బర్ పర్యటలో జగన్ మోహన్ రెడ్డి చేసిన విమర్శలు వాస్తవ విరుద్ధంగా ఉన్నాయి.. నేడు కేవలం తన రాజకీయ ఉనికి చాటుకోవడానికి తప్ప, మత్స్యకారుల ప్రయోజనాల కోసం జగన్ మోహన్ రెడ్డి జువ్వలదిన్నెకు ఎంతమాత్రం రాలేదన్నారు.. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను ప్రైవేట్ పరంగా చేస్తున్నారన్న వార్తలు పూర్తిగా అవాస్తవమని మండిపడ్డారు. మొత్తం 114 ఎకరాల జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ భూమిలో కేవలం 7 ఎకరాలు మాత్రమే సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ లిమిటెడ్‌కు కేటాయించామని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు.. 40 సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, 900 మీటర్ల మేర ఉన్న జెట్టీలో 150 మీటర్లు మాత్రమే సదరు యూనిట్ కోసం వినియోగిస్తుంటే.. వాస్తవాలను ఏమార్చి.. గత ప్రభుత్వ నేతలు మత్స్యకారుల్ని రెచ్చగొట్టేలా రాజకీయం చేస్తున్నారన్నారు.. దీనివల్ల మత్స్యకారులకు ఏవిధమైన నష్టం లేదు.. పైగా స్థానికంగా మత్స్యకారులుకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో విధ్వంసంతో రాజకీయాలు చేయడం మొదటి నుంచి వారికి అలవాటేనని మంత్రి అన్నారు.. నేడు రాజకీయంగా తమ ఉనికిని కాపాడుకోవడానికి మాజీ సీఎం, ఆ పార్టీ నేతలు మతి చలించి మాట్లాడుతున్నారన్నారు.. అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రం నుంచి పరిశ్రమలను వెళ్లగొట్టిన ఆ పార్టీ నేతలు... నేడు ప్రతిపక్షంలో ఉండగా రాష్ట్రానికి పరిశ్రమలు వస్తే, కూటమి ప్రభుత్వం మరింత బలపడుతోందని, పరిశ్రమలపై బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు.

# రాష్ట్రంలో నర్సింగ్ విద్యా సంస్థల ఏర్పాటుపై కీలక నిర్ణయం

- ప్రభుత్వ ప్రకటనలకు అనుగుణంగా వచ్చే దరఖాస్తులు మాత్రమే పరిగణన..

- స్వచ్ఛందంగా చేసే ప్రతిపాదనలు పరిశీలించబడవన్న మంత్రి సత్యకుమార్ యాదవ్..

**విజయవాడ,ఏప్రిల్ 16,ప్రభాత వార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఇబ్బడిముబ్బడిగా నర్సింగ్ విద్యా సంస్థల ఏర్పాటు నేపథ్యంలో ప్రతి సంవత్సరం వేలాది నర్సింగ్ సీట్లు మిగిలిపోతున్నందున పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకనుంచి రాష్ట్ర అవసరాల దృష్ట్యా నర్సింగ్ విద్యా సంస్థల ఏర్పాటుకు ప్రభుత్వం ఇచ్చే ప్రకటనల మేరకు వచ్చే ప్రతిపాదనల్ని మాత్రమే పరిశీలిస్తామని వైద్యారోగ్య శాఖా మంత్రిసత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. గురువారంనాడు వెలగపూడి లోని ఏపీ సచివాలయంలో నర్సింగ్ విద్యకు సంబంధించిన పలు అంశాల సమీక్షా సమావేశంలో విస్తృత చర్చ అనంతరం మంత్రి ఈ మేరకు స్పష్టమైన ప్రకటన చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే 691 నర్సింగ్ విద్యా సంస్థలు నడుస్తున్నాయని, వీటి ద్వారా ప్రతి ఏడాదీ దాదాపు 32,000 మంది నర్సులు పట్టబద్రుల వుతున్నారని, దరిమిలా గత కొన్నేళ్లుగా సుమారు 6,000 నర్సింగ్ సీట్లు భర్తీ కాకుండా మిగిలిపోతున్నాయని సమీక్షలో అధికారులు మంత్రికి వివరించారు. 2014 నుంచి నేటి వరకు 243 నర్సింగ్ కాలేజీలు, స్కూళ్ల మంజూరు చేయబడ్డాయని వారు తెలిపారు. ఇవన్నీ వివిధ సంస్థల స్వీయ ప్రతిపాదనల మేరకు (సుమోటో) వివిధ ప్రభుత్వాలు మంజూరు చేశాయి. ఇందుకు భిన్నంగా మొదటిసారిగా కూటమి ప్రభుత్వం గత ఏడాది రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో నర్సింగ్ విద్యా సంస్థల ఏర్పాటుకు ఔత్సాహిక సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ ప్రకటనకు స్పందించి వచ్చిన దాదాపు 345 దరఖాస్తులు హైపవర్ కమిటీ పరిశీలనలో ఉన్నాయి. ఈ కారణాల వలన పరిస్థితిని చక్కదిద్దేందుకు మంత్రి సత్యకుమార్ యాదవ్ కీలక నూతన నిర్ణయాన్ని ప్రకటించారు. గిరిజన ప్రాంతాలకు సంబంధించి ఈ విషయంలో మినహాయింపు ఉంటుందని మంత్రి తెలిపారు. సమీక్షలో హైపవర్ కమిటీ ఛైర్మన్, న్యాయమూర్తి ఉప్మాక దుర్గాప్రసాదరావు, ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, డిఎంఇ డాక్టర్ రఘునందన్, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ సుశీల పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్ర మణిహారంగా భోగాపురం ఎయిర్‌పోర్టు

## 9 జిల్లాల వారికి మరింత అనువుగా విమాన సౌకర్యం

**బొబ్బిలి/విజయనగరం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** ఇప్పటికే అనేక ప్రతిష్టాత్మక విమానాశ్రయాలను నిర్మించిన జిఎంఆర్ సంస్థ విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మిస్తున్న అల్లూరి సీతా రామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నూతన పంథాతో ముందుకు సాగుతుంది. 9 జిల్లాల వాసులకు విమానయానం చేసేందుకు అనువైనదిగా భోగాపురాన్ని తీర్చిదిద్దుతున్నారు. విమానాశ్రయ రాకపోకలకు ఎటువంటి అంతరాయం లేకుండా కనెక్టివిటీ రోడ్లను మెరుగుపరుస్తూ భోగాపురం విమానాశ్రయాన్ని అత్యంత చేరువ చేస్తున్నారు. విశాఖ విజయనగరం శ్రీకాకుళం జిల్లాలలో అనేక సాఫ్ట్వేర్ కంపెనీలు, వివిధ పరిశ్రమలు విరివిగా ఏర్పాటు అవుతుండడంతో అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాధాన్యతను సంతరించు కుంది. ఆర్థిక రాజధానిగా రూపాంతరం చెందుతున్న విశాఖ నగరంలో ప్రస్తుతం ఉన్న ఎయిర్‌పోర్ట్ స్థానంలో 2,800 ఎకరాల విస్తీర్ణంలో భోగాపురంలో నిర్మిస్తున్న ఈ విమానాశ్రయం ఒడిస్సా చత్తీస్ఘడ్ ప్రాంతాల వారికి కూడా అందుబాటులో ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణీకులు ఈ విమానాశ్రయం ద్వారా రాకపోకలు సాగిస్తారని అంచనా వేస్తున్నారు. ఆధునిక విధానంతో ఎయిర్‌పోర్ట్‌లో అన్ని సదుపాయాల అందించడంతోపాటు సమీపంలో నిర్మితమవుతున్న వివాంత హోటల్ ఎయిర్‌పోర్ట్ రాకపోకలు సాగించే వారికి అణువుగా ఉంటుందని భావి స్తున్నారు. భోగాపురం అంతర్జాతీయ విమా నాశ్రయ నిర్మాణ అభివృద్ధి వేగం పుంజుకోవడంతో, విశాఖపట్నం నగరం మరియు కొత్త విమాన కేంద్రం మధ్య రవాణా



వేగాన్ని పెంచుతూ కనెక్టివిటీని అభివృద్ధి చేసే దిశలో రోడ్డు మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి అధికారులు ప్రయత్నాలను వేగవంతం చేస్తున్నారు. ట్రాఫిక్ ప్రవాహాన్ని మెరుగుపరచడానికి, రద్దీని తగ్గించడానికి మరియు విమానాశ్రయానికి వేగంగా చేరుకునేందుకు అధికారులు ఏడు ప్రాధాన్యత రోడ్లను గుర్తించారు. భోగాపురం అంతర్జాతీయ విమానా శ్రయానికి కనెక్టివిటీని పెంచడానికి, అధి కారులు అభివృద్ధి మరియు అప్‌గ్రేడేషన్ కోసం ఏడు కీలక కేంద్రాల్లో కనెక్టివ్ రోడ్లను (రోడ్ నంబర్లు 5, 6, 7, 10, 12, 14 మరియు 15) గుర్తించారు. ఈ రహదారులు నగర పరిమితుల్లో గుండా వెళుతున్న భారీ రద్దీగా ఉండే హైవే కారిడార్ నుండి ట్రాఫిక్‌ను మళ్లించడానికి వ్యూహాత్మకంగా రూపొందించబడ్డాయి. ముఖ్యంగా గాజువాక మరియు ఆనందపురం జంక్షన్ మధ్య పాత విబీ స్ట్రెచ్, ఇందులో ప్రస్తుతం 12 ప్రధాన జంక్షన్‌లు ఉన్నాయి. అనకాపల్లి,

ఆనందపురం ఎన్‌హెచ్ 16 బైపాస్ మరియు బీచ్ రోడ్ కారిడార్ వైపు.

మెరుగుదల కోసం గుర్తించబడిన కీలక స్ట్రెచ్‌లలో భీమిలీ తాళ్లవలస (4 కి.మీ.), భీమిలీ దొరతోట (6.2 కి.మీ.), మంగమారి పెట బోయపాలెం (6 కి.మీ.), తిమ్మాపురం మారికవలస (6.3 కి.మీ.), సింహాచలం సొంత్యాం (8 కి.మీ.), వేపగుంట పెందుర్తి (6.15 కి.మీ.) మరియు వేపగుంట పినగడి (7.12 కి.మీ.) ఉన్నాయి. ఈ మార్గాలు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంలో మరియు విమానాశ్రయానికి చివరి మైలేజీ కనెక్టివిటీని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని భావిస్తున్నారు.

## రాష్ట్ర పండుగగా భగీరథ జయంతి

- మంత్రి సవిత

**విజయవాడ, ఏప్రిల్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** మహర్షి భగీరథుని జయంతిని ఈ నెల 23నరాష్ట్ర పండుగగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. ఆరోజు రాష్ట్ర వ్యాప్తంగా భగీరథుని జయంతి అధికారికంగా నిర్వహించేలా కూటమి ప్రభుత్వం జీవో జారీచేసిందన్నారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. సగర కులస్తుల ఆరాధ్య దైవం మహర్షి భగీరథుడన్నారు. ఒంటికాలిపై నిల్చొని, భారీ తపస్సు చేసి, గంగను దివి నుంచి భువి తీసుకొచ్చిన మహనీయుడన్నారు. తన పట్టుదలతో, కఠోర తపస్సుతో భగీరథుడు అసాధ్యాన్ని సుసాధ్యం చేశారన్నారు. భగీరథుని త్యాగం, పట్టుదల నేటి తరానికి తెలియ జేయాలన్న సంకల్పంతో ఆ మహనీయుని జయంతిని ఈ నెల 23న రాష్ట్ర పండుగగా అధికారికంగా నిర్వహించనున్నా మన్నారు. కర్నూలులో భగీరథుని రాష్ట్ర స్థాయి జయం త్యోత్సవం చేపట్టనున్నామన్నారు. గతేడాది విశాఖలోని గాజువాకలో అంగరంగ వైభవంగా భగీరథుని రాష్ట్ర స్థాయి జయంతిని నిర్వహిం చినట్లు మంత్రి సవిత గుర్తు చేశారు.

## ఘనంగా కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి

**విజయవాడ,ఏప్రిల్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ తెలుగు నాటకరంగ పితామహుడు, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు 178 వ జయంతి వేడుకలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలన చిత్ర, టీవీ మరియు నాటకరంగ అభివృద్ధి సంస్థలో గురువారం ఘనంగా నిర్వహించారు. విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ ప్రాంగణంలోని ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ 4వ అంతస్తు లోని ఎఫ్.డి.సి (నీదిది) కార్యాలయంలో కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా ఏపీఎస్ఎఫ్టీవీటీడీసీ మేనేజింగ్ డైరెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ మాట్లాడుతూ.. మొట్టమొదటి తెలుగు నాటక రచయితగా గుర్తింపు పొందిన కందుకూరి జన్మదినమైన ఏప్రిల్ 16 ను ప్రతి ఏటా ఖితెలుగు నాటకరంగ దినోత్సవంఖిగా జరుపుకుంటున్నామని గుర్తుచేశారు. ఆయన రచించిన ఖివ్యవహార ధర్మబోధినిఖి తొలి తెలుగు రూపక ప్రదర్శన జరిగిన నాటకమని, వీరేశలింగం పంతులు గొప్ప రచయిత మాత్రమే కాక, నవయుగ వైతాళికుడని కొనియాడారు. ఆధునిక ఆంధ్ర సమాజ పితామహుడిగా కందుకూరి చేసిన సామాజిక విప్లవం చిరస్మరణీయమని, వారిని స్మరించుకోవడం మనందరి అదృష్టంగా భావిస్తున్నామన్నారు. నాటకాలు, ప్రహసనాలు, స్వతంత్ర రచనలతో పాటు ప్రాచీన భారతీయ, పాశ్చాత్య సాహిత్యాన్ని సైతం వారు తెలుగులోకి అనువదించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఫ్.డి.సి జనరల్ మేనేజర్ ఎం. శ్రీనివాస్ నాయక్, మేనేజర్ చల్లా శ్రీనివాసులు, సంస్థ సిబ్బంది పాల్గొని కందుకూరి వీరేశలింగం పంతులు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

## సైబర్ నేరాల కట్టడిలో బ్యాంకర్లు కీలక పాత్ర పోషించాలి

- తిరుపతి పోలీస్‌శాఖ సమావేశంలో వక్తలు



**తిరుపతి,ఏప్రిల్ 16ప్రభాతవార్తప్రతినిధి:** సైబర్ నేరాలు విస్తరిస్తున్న నేపథ్యంలో బ్యాంకర్లు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని తిరుపతి జిల్లా పోలీస్ అధికారులు సూచించారు. ఈ సదస్సు ద్వారా సంబంధిత బ్యాంకు అధికారులతో గురువారం సాయంత్రం తిరుపతి పోలీస్ జిల్లా కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సైబర్ మోసాల నివారణపై బ్యాంకర్ల పాత్ర అంశంపై కీలకంగా సదస్సులో చర్చించారు. డిజిటల్ అరెస్ట్, సైబర్ మోసాలపై జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. నేటి హైటెక్ మోసాలపై జాగ్రత్తలు, నివారణ చర్యలపై చర్చ సాగింది. పోలీస్,బ్యాంకింగ్ వ్యవస్థల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయాలని సూచించారు. వినియోగదారుల ఆర్థిక భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, బ్యాంకర్లు, పోలీసుల సమన్వయంతో సైబర్ నేరాలపై సమర్థవంతమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో బ్యాంకింగ్ రంగానికి చెందిన అధికారులతో కలిసి సైబర్ మోసాలను ఎలా గుర్తించాలి, వాటిని ఎలా అడ్డుకోవాలి, బాధితులకు త్వరితగతిన సహాయం అందించే విధానాలపై చర్చ జరిగింది ఇటీవల "డిజిటల్ అరెస్ట్" పేరుతో జరుగుతున్న మోసాలు, ఫేక్ కాల్స్, ఫిషింగ్ లింక్స్, వీగిశ మోసాలు వంటి హైటెక్ నేరాల పట్ల బ్యాంక్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సైబర్ నేరాల విచారణలో వేగవంతమైన సమాచార మార్పిడి, ఖాతాల ఫ్రీజింగ్, బాధితులకు తక్షణ సహాయం అందించడం వంటి అంశాల్లో పరస్పర సహకారం అవసరమని స్పష్టం చేశారు. వినియోగదారుల ఆర్థిక భద్రతను కాపాడటం బ్యాంకింగ్ వ్యవస్థ యొక్క ముఖ్య బాధ్యత అని పేర్కొంటూ, ప్రజలకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించడం ద్వారా మోసాలను ముందుగానే అరికట్టవచ్చని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు రవిమనోహరచారి, ఐ. రామకృష్ణ, ఏ. శ్రీనివాసులు, ఎస్‌బీ డీఎస్పీ గీతా కుమారి, డిఎస్పీలు శ్రీలత, శ్యామ్‌సుందర్, భక్తవత్సలం, జి. వి. రవికుమార్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

# మా డబ్బులు మాకిస్తే రాజీనామా చేస్తాం

## ఆదిమూలం తనయుడు జడ్పిటిసి కోనేటి సుమన్‌కుమార్ కీలక వ్యాఖ్యలు



**తిరుపతి హెల్త్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా, సత్యవేడు నియోజకవర్గంలో తాము ఎలక్షన్‌లో ఖర్చు చేసిన డబ్బులు మాకు తిరిగి ఇస్తే రాజీనామా చేస్తామని సస్పెండ్ అయిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తనయుడు కోనేటి సుమన్ కుమార్ సవాల్ విసిరారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాన్న ఆదిమూలం ఎమ్మెల్యే కాకముందు గంగాప్రసాద్ ఆదేశాల మేరకు నాన్నకి టికెట్ ఇచ్చారని చెప్పారు. నాన్నకు సుమారు 75 సంవత్సరాలు వయసు కలిగి, గుండె జబ్బుతో బాధపడుతున్నాడని, ఆ సమయంలో జనసేన పార్టీ నాయకులు పవన్ కళ్యాణ్ పరామర్శించారని చెప్పారు. సత్యవేడు నియోజకవర్గంలో కోనేటి ఆదిమూలంను చూసి ఓట్లు వేశారే కానీ, పార్టీని చూసి కాదని, ఓట్లు వేసిన నియోజకవర్గ ప్రజలకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత టిడిపిలోనే కొంతమంది వ్యక్తులు నాన్నకు వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. తెలుగు దేశం పార్టీ ఆకువేసి అన్నం పెట్టి, అన్నంలో విషం కలిపారని, ఇలాంటివి మంచి పద్ధతి కాదని పార్టీ అధిష్టానానికి సూచించారు. మేము అప్పులు చేసి పార్టీ కోసం ఖర్చు పెట్టి ఎమ్మెల్యేగా గెలిచామని, మాకు ఆ గౌరవం దక్కలేదని అన్నారు. ఒక చిన్న సమస్య వలన ఆదిమూలంను పార్టీ నుండి సస్పెండ్ చేశారని, ఇంకెవరూ ఏ తప్పులు చేయలేదా? అని ప్రశ్నించారు. ఎస్సీకి చెందిన ఎమ్మెల్యే కాబట్టి చర్యలు తీసుకున్నారని, పార్టీలో తప్పులు చేసిన వారిని కొందరిని పట్టించుకోలేదని ఆరోపించారు. ఎస్సీ రిజర్వేషన్ అయిన నియోజకవర్గంలో ఇన్చార్జిగా ఎస్సీకి సంబంధించిన వ్యక్తిని ఎందుకు పెట్టలేదని నారా చంద్రబాబు నాయుడుని, నారా లోకేష్‌ని సూటిగా ప్రశ్నిస్తున్నానన్నారు. పులిలా బతికే ఆదిమూలంను తెలుగుదేశం పార్టీలోనే కొంతమంది వెన్నుపోటు దారులు పిల్లిని చేశారని అన్నారు. ఎక్కడున్నా పులిపులే అన్నారు. సత్యవేడులో ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగ బాధ్యతను పక్కనపెట్టి రాజకీయాలు చేస్తున్నారని, దగ్గరుండి ఇసుకను తమిళనాడుకు రోజుకు 50 నుంచి 60 లోడ్లు పంపుతున్నాడని ఆరోపించారు.

## ఆర్టీసి స్టాఫ్ రిటైర్మెంట్ బెట్ ఫిట్ స్కీం నిధులు విడుదల

**విజయవాడ, ఏప్రిల్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం మరో శుభవార్త తెలిపింది. స్టాఫ్ రిటైర్మెంట్ బెట్ ఫిట్ స్కీం (ఎస్ఆర్‌బిఎస్) నిధులు వాపస్ చేసేందుకు నిధులు విడుదల చేసింది. ఏపీఎస్ఆర్టీసిని ఎస్ఆర్‌బీఎస్ సభ్యులై పొదుపు చేసిన ఆర్టీసీ ఉద్యోగుల డబ్బు వాపస్ చేయనుంది. 2030 మే నెల వరకు రిటైర్డ్ అయ్యే ఉద్యోగులుకు చెల్లింపులు చేయాలని నిర్ణయించింది. దీంతో 8450 మంది ఆర్టీసీ ఉద్యోగులకు రూ. 75 కోట్లును ప్రభుత్వం విడుదల చేసింది. రిటైర్మెంట్ తర్వాత పింఛన్ కోసం ఎస్ఆర్ బీఎస్ ను ఏర్పాటు చేసుకున్న ఆర్టీసీ ఉద్యోగులు నెల నెలా కొంత మొత్తాన్ని పొదుపు చేసుకునేవారు. ప్రభుత్వంలో విలీనం అనంతరం ఎస్ఆర్ బీఎస్‌ను గత ప్రభుత్వం రద్దు చేసింది. తాము పొదుపు చేసిన మొత్తం తిరిగి ఇవ్వాలని ఉద్యోగుల కోరిక మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. నిధులు విడుదల చర్యలు తీసుకోవడంపై ఆర్టీసీ కార్మికపరిషత్ నేతలు కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. సీఎం చంద్రబాబు, రవాణామంత్రి రాంప్రసాదరెడ్డి, ఆర్టీసీ చైర్మన్‌కు కార్మిక పరిషత్ శేషగిరిరావు, వై శ్రీనివాస్ తదితరులు ధన్యవాదాలు తెలిపారు.

## వాసవీ వనంలో వికసించిన సింధు

## ఫస్ట్ ఇయర్ ఇంటర్ సిఇసిలో స్టేట్ సెకండ్ ర్యాంక్



**ఏప్రిల్ 16, పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో:** గ్రామీణ ప్రాంతమైన పెనుమంట్ర మండలం మార్టేరు గ్రామానికి చెందిన కొవ్వూరి సింధు భవిత ఇంటర్ ప్రథమ సంవత్సరం సీఈసీ లో స్టేట్ రెండో ర్యాంక్ సాధించింది. 500 మార్కులకు గాను 491 సాధించి తెచ్చుకున్న రాష్ట్రస్థాయి రెండో ర్యాంకు ద్వారా పశ్చిమగోదావరి జిల్లాకే మంచి పేరు తీసుకొచ్చింది. ఈ ర్యాంకు సాధించడానికి పదవ తరగతి ఉత్తీర్ణత అయినవేంటనే మొబైల్ వాడటం, టీవీ చూడడం గానీ తనకు తెలియదని చెప్పింది. ఇంత సాధించినా తాను భవిష్యత్తులో గౌరవమైన ఉపాధ్యాయ వృత్తి చేపడతానని అందుకే సోషల్ సబ్జెక్టు తీసుకున్నానని ప్రభాతవార్తకు తెలిపింది. తనకు తండ్రి కర్రి శ్రీనివాసరెడ్డి, తల్లి వెంకట శ్రీదేవి సహకారం ఎంతో ఉందని పదవ తరగతిలో ఉత్తమమైన మార్కులు సాధించినప్పటికీ ఫలానా కోర్సు తీసుకోమని ఒత్తిడి చేయలేదని సింధు తెలిపింది. పెనుగొండ శ్రీ వాసవి మహిళా కళాశాల ఉపాధ్యాయులు తనకెంతో సహకరించారని సులువైన మార్గంలో పాఠ్యాంశాలు బోధించారని తన విజయంలో కుటుంబ ప్రోత్సాహం కలశాల సహకారం ఎంతో ఉందని వివరించారు. ఈ సందర్భంగా తండ్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ కుటుంబానికి చెందిన తాను కుమార్తె ఉపాధ్యాయ వృత్తి ధ్యేయంగా సోషల్ సబ్జెక్టు తీసుకుంటాననంటే సంతోషంగా ఒప్పుకున్నారన్నారు.

## శ్రీకాళహస్తిలో రూ.500 రాహుకేతుదోష నివారణ పూజలు రద్దు!

### రూ.5వేల పూజలు ఇక రూ.6 వేలు

**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 16 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలకు సంబందించి కీలక నిర్ణయం తీసుకున్నట్లు శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. బోర్డు సమావేశం తరువాత ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సమావేశంలో 22 అంశాలకు సంబంధించి చర్చించామని అలాగే కొత్తగాబాధ్యతలుచేపట్టిన ఇఓ బికె వెంకటేశులు వివిధ అంశాలకు సంబంధించి అధ్యయనం చేసిన తరువాత పలు సూచనలు సమావేశంలో వెల్లడించారని వాటిపై చర్చించినట్లు తెలిపారు. ధర్మకర్తల మండలి సమావేశంలో అంశాలకు సంబంధించి కూలంకషంగా చర్చించామన్నారు. ఇందులో 14 అంశాలు కీలకంగా ఉన్నాయని ఎంఎల్ఏ వివరించారు. బోర్డు చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నిర్ణయాలను ఎంఎల్ఏ మీడియాకు వివరించారు ఇక శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న రాహుకేతుదోష నివారణ పూజలకు దేవస్థానం అందించే వెండి నాగపడగలకు సంబంధించి వెండి ధరలు విపరీతంగా పెరిగినందువల్ల నిర్వహణ దృష్ట్యా రూ.500ల రాహుకేతుదోష నివారణ పూజలను రద్దు చేసినట్లు ప్రకటించారు.అయితే రూ.750,1500,2500 ల పూజలు యథాతథంగా నిర్వహించబడుతాయని వివరించారు.

## సత్యం, దయ, క్షమ జీవన మార్గదర్శకాలు

- 84 లక్షల జీవరాశులలో గోవు చాలా పవిత్రం

- ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు

**తిరుమల,ఏప్రిల్ 16ప్రభాతవార్తప్రతినిధి:** సత్యం, దయ, క్షమ జీవన మార్గదర్శకాలని, నిత్య జీవితంలో ధర్మాచరణం ప్రతి ఒక్కరి కర్తవ్యమని ఆధ్యాత్మిక ప్రవచన కర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు హితవు చేశారు. ఇంటి నుంచే ప్రారంభమయ్యే ధర్మం సమాజానికి శాశ్వత దిక్సూచి అన్నారు. 84 లక్షల జీవరాశులలో గోవు పవిత్రమైనదని, ప్రతి బిడ్డ తల్లిని గౌరవించడం నేర్చుకోవాలని సందేశమిచ్చారు. ధర్మాన్ని కాపాడితే దేవుడు మన వెంట ఉంటాడని, శ్రీవేంకటేశ్వరుడు కరుణామయుడని కోటేశ్వరరావు పేర్కొన్నారు. టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో తిరుపతి మహతి కళాక్షేత్రంలో గురువారం సాయంత్రం నిర్వహించిన ధార్మికోపన్యాస కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. "నిత్య జీవితంలో ధర్మాచరణం" అనే అంశంపై ఉపన్యసించిన ఆయన, కాలానుగుణంగా ధర్మంలో మార్పులు వచ్చినా సత్యం ఎప్పటికీ నిలకడగా ఉంటుందని తెలిపారు. సత్యం, అహింస, దయ, క్షమ, సహనం వంటి గుణాలు ధర్మానికి మూలాధారాలని, ఇవే మనిషిని ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయని చెప్పారు. ఎక్కడ ధర్మం ఉంటుందో అక్కడ భగవంతుని సాన్నిధ్యం తప్పక ఉంటుందని, శ్రీరాముడు ధర్మానికి ప్రతీకగా నిలిచిన మహానుభావుడని వివరించారు. ప్రతి ఒక్కరూ తమ నిత్య జీవితంలో ధర్మాచరణకు పెద్దపీట వేయాలని, ముఖ్యంగా తల్లిదండ్రులను గౌరవించడం, గురువులను స్మరించడం, పెద్దలను ఆదరించడం, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం మన బాధ్యత అని చెప్పారు.

## అమరావతి ఔటర్ రింగ్ రోడ్ వ్యవహారం.. హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు

**విజయవాడ ఏప్రిల్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణంపై దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు పిల్‌పై విచారణ జరిపిన హైకోర్టు ఈ సందర్భంగా రహదారి నిర్మాణాన్ని నిలిపివేయాలన్న పిటిషనర్ అభ్యర్థన తిరస్కరించింది. విచారణ సందర్భంగా పలు తీవ్ర వ్యాఖ్యలు చేసింది.

ఇటీవలి కాలంలో మెజారిటీ ప్రజాహిత వ్యాజ్యాలు రాజకీయ దురుద్దేశాలతో దాఖలవుతున్నాయని పేర్కొంది. ఈ పిల్ కూడా నిజంగా సదుద్దేశంతోనే దాఖలైందా అనే అనుమానం కలుగుతోందని కోర్టు వ్యాఖ్యానించింది. ఓఆర్ఆర్ ఎక్కడ నిర్మించాలనే అంశాన్ని ఒక వ్యవసాయదారుడు ఎలా నిర్ణయిస్తారని హైకోర్టు ప్రశ్నించింది. మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల విషయంలో కోర్టు జోక్యం చేసుకోబోదని స్పష్టం చేసింది. అయితే, కేసుకు సంబంధించి మరిన్ని వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టును కోరారు. దీంతో తదుపరి విచారణను హైకోర్టు రెండు వారాలకు వాయిదా వేసింది.

## ఇన్‌స్టా ఫ్రెండ్స్‌తో విహారయాత్ర

- చిత్తూరులో అదృశ్యమైన ఇద్దరు మైనర్‌బాలికలు

- 48 గంటల్లో కేసును ఛేదించి పిల్లలను తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

**చిత్తూరు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** ఇన్‌స్టాగ్రాంలో పరిచయం అయిన స్నేహితులతో విహారయాత్రకు వెళ్ళడానికి ఇంట్లో అనుమతి ఇవ్వరని నిర్ధారించుకున్న ఇద్దరు మైనర్ బాలికలు రెండు రోజుల క్రితం చిత్తూరు నుండి ఒక్కసారిగా అదృశ్యం అయ్యారు. సాయంత్రం అవుతున్నప్పటికీ మైనర్ బాలికలు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు చిత్తూరు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ పోతూరి మహేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. డిఎస్పీ వెంకట నారాయణ పర్యవేక్షణలో వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ పోతూరి మహేశ్వర్ ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బృందాలు ఈ కేసు దర్యాప్తును ప్రారంభించాయి. ఈ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసు బృందాలు సాంకేతిక ఆధారాలు వినియోగించడంతో పాటు బాలికలు వినియోగించిన సోషల్ మీడియా అకౌంట్లను విశ్లేషించారు. అలాగే సిసి కెమెరా దృశ్యాలను పరిశీలించి చిత్తూరులో అదృశ్యం అయిన ఇద్దరు మైనర్ బాలికలు గుంటూరు, ఒంగోలు పరిసర ప్రాంతాల్లో వున్నట్లు గుర్తించారు. చిత్తూరు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్ పోతూరి గుంటూరు, ఒంగోలు జిల్లాల పోలీసులను సమన్వయం చేసుకుని ఇద్దరు మైనర్ బాలికలను సురక్షితంగా గురువారం చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు రప్పించారు.

## విద్యుత్ సరఫరా వ్యవస్థలో భద్రతా ప్రమాణాలు అవసరం

### ఎస్పీడిసిఎల్ మాజీ సిఎండి జె.పద్మ జనార్ధన్ రెడ్డి



**తిరుమల,ఏప్రిల్ 16ప్రభాతవార్తప్రతినిధి:** విద్యుత్ సరఫరా వ్యవస్థలో భద్రతా ప్రమాణాలు పాటించి, మెరుగైన విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఎస్పీడీసీఎల్ మాజీ సిఎండి జె.పద్మ జనార్ధన్ రెడ్డి సూచించారు. ఎలక్ట్రికల్ ఇన్స్టాలేషన్, నిర్వహణ, ముందస్తు జాగ్రత్త చర్యలు వంటి పలు సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించారు. భద్రతా ప్రమాణాలపై గురువారం మధ్యాహ్నం తిరుమలలోని ఎస్వీ మ్యూజియం ఆడిటోరియంలో టిటిడి సిబ్బందికి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సిఎండి జె.పద్మజనార్ధన్ రెడ్డి అనేక అంశాలపై అవగాహన కల్పించారు. టిటిడి ఎడిఎఫ్ఓ పి.అనిల్ కుమార్ అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి డిఇ చంద్ర శేఖర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

